www.prajasakti.com
ప్రజాశక్తి
శుక్రవారం 22 నవంబర్ 2024
5
తూర్పుగోదావరి



ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి ఆధ్వర్యంలో గురువారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే అధ్యక్షతన ట్రాఫిక్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ట్రాఫిక్ సిఐ అబ్దుల్ నబీ మాట్లాడారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తే రోడ్డు ప్రమాదాలను అరికట్టవచ్చని, వాహనదారులకు తప్పనిసరిగా లైసెన్సు ఉండాలని, సైబర్ క్రైమ్ నేరాలపై తప్పనిసరిగా అందరూ జాగ్రత్త వహించాలని సూచించారు. మైనర్ రైడింగ్, ట్రిపుల్ రైడింగ్ వల్ల కలిగే దుష్ఫలితాలపై ఎస్ఐ శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు కె.సుభాషిణిదేవి, డాక్టర్ బి. భవాని, సిహెచ్.పవన్, ఎన్‌సిసి కో-ఆర్డినేటర్ డాక్టర్ యూసఫ్ బాషా, డాక్టర్ కె.అనూష పాల్గొన్నారు.

ఆపద్బాంధవికే ఆపద

- 25 నుంచి సమ్మెలోకి 108 ఉద్యోగులు
- ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా ఆపద్బాంధవికే ఆపద రానుంది. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ 108 నిర్వహణ బాధ్యతలు వివిధ కార్పొరేట్ కంపెనీలు చేపట్టడం, ఆయా కంపెనీలు తమ లాభాల కోసం ఉద్యోగులతో వెట్టి చాకిరీ చేయించుకోవటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను చక్కదిద్దేందుకు ప్రభుత్వమే బాధ్యతలు చేపట్టి తమకు భద్రత కల్పించాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. గత కొంతకాలం ఒక వైపు పెరుగుతున్న పని ఒత్తిడి, మరోవైపు ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీరకలేని విధులతో 108 అంబులెన్స్ సిబ్బంది సతమతం అవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలుగు రోజులకు ఒకసారి ఆఫ్ ఇవ్వాల్సి ఉంది.



సిబ్బంది కొరతతో సెలవులు మంజూరు చేయడం లేదు. కనీసం ఆఫ్‌లు ఇవ్వడం లేదు. విరామం లేకుండా విధులు నిర్వహిస్తుండడంతో మానసికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో 21 వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాల్లో దాదాపుగా 101 మంది వివిధ బాధ్యతలు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారు. మూడు కేటగిరీలుగా తొలి కేటగిరీకి రూ.18 వేల నుంచి రూ.20 వేలు, మరొక కేటగిరీకి రూ.23 వేల నుంచి రూ.25 వేలు, ఇంకొక కేటగిరీకి రూ.28 వేల నుంచి రూ.30 వేల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు. ఒక మండలంలో వాహనం అందుబాటులోకి లేనట్టయితే మరో మండల వాహనాన్ని పంపుతున్నారు. ప్రతి వాహనానికీ నలుగురు సిబ్బంది ఉన్నారు. ఇద్దరు పైలట్‌లు, మరో ఇద్దరు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్‌లు సేవలందిస్తున్నారు. పగటి వేళల్లో ఇద్దరు, రాత్రి వేళల్లో ఇద్దరు వంతున విధులు నిర్వహిస్తున్నారు. రెండు వాహనాలకు వచ్చేసరికి పది మంది సిబ్బంది ఉండాలి. అంటే నాలుగు రోజులకు ఒకసారి ఆఫ్ ఇచ్చినప్పుడు అదనంగా ఉండే ఇద్దరు సిబ్బంది విధుల్లో ఉంటారు. పూర్తి స్థాయిలో సిబ్బంది లేకపోవటంతో పని ఒత్తిడి పెరుగుతోంది. ప్రస్తుతం రెండు వాహనాలకు 8 మంది సిబ్బందితోనే కాలం వెళ్లబుచ్చుతున్నారు. దానివల్ల ఆఫ్‌లు లేకుండా పోతున్నాయి. సెలవులు ఇవ్వడం లేదు. సిబ్బంది నిత్యం విధుల్లో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. తీరిక లేకుండా సిబ్బంది విధులు నిర్వహించాల్సి వస్తోంది. ప్రతి మండలంలోనూ 108 వాహనాలు అందుబాటులో ఉండాలి. అత్యవసర సమయాల్లో సేవలందించాలి. ఇప్పుడా పరిస్థితి లేదు. రాజమహేంద్రవరం, అమలాపురం వంటి జిల్లా కేంద్రాల నుంచి ప్రతిరోజు 5 లేక 6 వాహనాలు కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. ఏరియా ఆస్పత్రి నుంచి రిఫర్ చేసే కేసులకు ఆసుపత్రి సొంత వాహనాలు వినియోగించుకోవాలి. సొంత వాహనాలు లేకపోవడంతో 108లో కాకినాడ పంపుతున్నారు. జిల్లాలోని అన్ని పట్టణాల్లోని ఆస్పత్రులు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నాయి. ప్రతిరోజూ ఒక్కో ఆసుపత్రి నుంచి కనిష్టంగా నాలుగు కేసులను కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. ఇలా 108 వాహనాలు ఇప్పుడు రిఫర్ కోసమే ఉపయోగపడుతున్నాయి. ఫలితంగా అత్యవసర సమయాల్లో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వమే నిర్వహణ బాధ్యతలు చేపట్టాలి

ప్రభుత్వమే నేరుగా 108 బాధ్యతల నిర్వహణ చేపట్టాలి. ప్రభుత్వాలు మారిన ప్రతిసారీ వారికి అనుకూలమైన కార్పొరేట్ కంపెనీలకు నిర్వహణ బాధ్యతలు అప్పజెబుతున్నారు. ఫలితంగా ఉద్యోగులు సర్వీసును కోల్పోతున్నారు. సకాలంలో వేతనాలు విడుదల, కార్మిక చట్టాలకు అనుగుణంగా 8 గంటల పని విధానం అమలు, తదితర డిమాండ్‌ల సాధన కోసం ఈ నెల 25 నుంచి సమ్మె చేపట్టనున్నాము.

- జి.రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి,
108 ఎంప్లాయీస్ యూనియన్.



విద్యుత్ భవన్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న సిపిఐ, సిపిఎం నాయకులు

విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించొద్దని ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రి పెయిడ్ స్మార్ట్ మీటర్లను బిగించొద్దు, విద్యుత్ ట్రూఅప్ ఛార్జీల అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, సిపిఐ జిల్లా కార్యదర్శి టి.మధు మాట్లాడారు. ప్రజల పాలిట ఉరితాళ్లుగా మారనున్న విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముందుగా పలు జిల్లాలలో ప్రభుత్వ కార్యాలయాలకు ప్రి పెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించారని, ప్రస్తుతం చిన్న, మధ్యతరగతి వ్యాపార సంస్థలతో సహా అందరికీ స్మార్ట్ మీటర్లు పెడుతున్నారని తెలిపారు. కనీసం విద్యుత్ వినియోగదారుల అనుమతిలేకుండా షాప్స్, నివాస గహాలకు మీటర్లు బింగించడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. జిల్లాలో ఎక్కడ స్మార్ట్‌మీటర్లు బిగించినా ప్రజలందరూ ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. వైసిపి ప్రభుత్వం పంపుసెట్లకు మీటర్లు బిగించడాన్ని ప్రతిపక్షంలో ఉండగా తెలుగుదేశం, జనసేన పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. నాడు మీటర్లు పగలగొట్టాలని పిలుపునిచ్చివారే నేడు మీటర్లు బిగిస్తుండం ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. అదాని, షిర్డీ సాయి సంస్థలతో కుమ్మక్కయ్యి రూ.వేల కోట్ల అవినీతికి పాల్పడి ఒప్పందాలు చేసుకొని మీటర్లు పెడుతున్నారని నాడు ఆరోపించి, నేడు కూటమి ప్రభుత్వం మాట తప్పి మీటర్ల ఒప్పందాలను కొనసాగిస్తూ ప్రతి కనెక్షన్‌కు స్మార్ట్ మీటర్ పెట్టడం నమ్మకద్రోహమేనన్నారు. ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల వల్ల ప్రజలందరిపై భారం పెరుగుతుందని, ముందుగానే డబ్బు చెల్లించి రీఛార్జ్ చేయించుకోవాన్నారు. బ్యాలెన్స్ పూర్తి కాగానే అర్ధాంతరంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, పేదలకు అంధకారమే మిగులుతుందన్నారు. మరోవైపు ప్రతి మీటర్‌కు అయ్యే వ్యయం సుమారు రు.13 వేలను 96 నెలల పాటు వాయిదాల పద్ధతిలో వినియోగదారుల నుండే వసూలు చేస్తారని చెప్పారు. వ్యవసాయ ఉచిత విద్యుత్తుకు ఎసరపెట్టేందుకే పంపు సెంట్లకు మీటర్లు బిగిస్తున్నారని ఆరోపించారు. ఏ భారం ఉండదని పైకి చెప్తున్నా ప్రైవేట్ విద్యుత్ ఉత్పత్తిదారులకు దోచిపెడుతూ, ప్రజలపై భారాలు వేసేందుకు, ఉచిత విద్యుత్ ను దశలవారీగా తొలగించడానికి ఈ స్మార్ట్ మీటర్ల విధానాన్ని తీసుకువచ్చారని తెలిపారు. ఎన్నికల హామీలను విస్మరించి ప్రజలను వంచించటం తగదన్నారు. స్మార్ట్ మీటర్లపై ఎక్కడికక్కడ ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో సిపిఐ, సిపిఎం నగర కార్యదర్శులు వి.కొండలరావు, పవన్, సిపిఎం నాయకులు పి.తులసి, కె.రామకృష్ణ, ఎన్.రాజా, పి.రామకృష్ణ, సావిత్రి, స్రవంతి, తాతారావు, సుబ్రహ్మణ్యం, సోమేశ్వరరావు, రాంబాబు, భాస్కర్, సిపిఐ నాయకులు కె.రాంబాబు, శ్రీనివాస్, రమణమ్మ, యడ్ల లక్ష్మి, లావణ్య, అప్పలనాయుడు, బాలకృష్ణ, వెంకట్రావు, నాగేశ్వరావు, పేపర్ మిల్లు రామకృష్ణ, కార్యకర్తలు సిహెచ్.రామకృష్ణ, ఆర్.రామకృష్ణ, రాము, పాపాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ప్రజలు తమ ఆధార్ కార్డులను గ్రామంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులలో అప్డేట్ చేయించుకోవాలని చివటం పంచాయతీ కార్యదర్శి జివివి సత్యనారాయణ అన్నారు. గురువారం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ క్యాంప్‌ను ఆయన పరిశీలించారు. ఈ ప్రత్యేక క్యాంపు శుక్రవారం కూడా కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఆధార్ కార్డులలో సవరణలు తప్పనిసరిగా చేయించుకోవాలని, ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలకు బ్యాంకు ఎకౌంటు, ఆధార్ కార్డు అత్యవసరం కనుక లబ్ధిదారులు సంక్షేమ పథకాలు నష్టపోకుండా ప్రతి ఒక్కరూ బ్యాంక్ అకౌంట్ కలిగి ఉండాలని, ఆధార్ కార్డులో సవరణలు చేయించుకోవాలన్నారు. ఇకెవైసి చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 30 మంది కార్డులలో సవరణలు చేయించుకున్నట్లు ఆధార్ క్యాంప్ నిర్వాహకులు తెలిపారు.

పాడి పశువుల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

రాష్ట్రీయ గోకుల్ మిషన్‌లో భాగంగా పశువుల గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్సా కేంద్రం నిర్వహించినట్లు పశు గణాభివృద్ధి సంస్థ డిఎల్‌డిఎ డాక్టర్ జి.ఏసురత్నం తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రం ఉండ్రాజవరం వెటర్నరీ డిస్పెన్సరీ ఆవరణలో నిర్వహించిన పశువుల గర్భకోశ వ్యాధులకు ఉచిత చికిత్సతో పాటు అవసరమైన మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పాడి పశువులు, పెయ్య దూడల పెంపకంపై పాడి రైతులకు అవగాహన కల్పించినట్లు చెప్పారు. పశు సంపద కాపాడుకోవాల్సిన బాధ్యత ఒక్క పాడి రైతులకే కాదు ప్రతి ఒక్కరిదీ అన్నారు. ఈ కేంద్రంలో సుమారు 70 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఉండ్రాజవరం పశువైద్యాధికారి పి.శ్రీనివాస్ వర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో దమ్మెన్ను, ఉండ్రాజవరం సర్పంచులు గురజర్ల వీర వెంకట సత్యనారాయణ, మెండే వెంకట్రావు, డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుంకవల్లి సత్యనారాయణ, డాక్టర్ రుషి ప్రసాద్, ఎడి ఎం.మోహన్ రావు, ఎంఎం రాజేష్, డాక్టర్ సల్మా, కాల్దారి పారా సిబ్బంది పి.వనిత పాల్గొన్నారు.



అమరావతిలో విద్యార్థుల పర్యటన

విజ్ఞానదాయకంగా విద్యార్థుల పర్యటన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్స్ కళాశాల సామాజిక శాస్త్ర విభాగాల విద్యార్థుల అమరావతి క్షేత్ర పర్యటన విద్యా, వినోదదాయకంగా సాగిందని అధ్యాపకులు తెలిపారు. విద్యార్థులు అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం కలిగిందన్నారు. రాజనీతి శాస్త్రం, జర్నలిజం, సోషల్ వర్క్, తత్వ శాస్త్ర విద్యార్థులు, ఆయా విభాగాల అధ్యాపకులు కలిసి మొత్తం 100 మంది ఈ పర్యటనలో పాల్గొన్నారు. సచివాలయ భవన సముదాయాన్ని సందర్శించారు. అసెంబ్లీ ప్రాంగణంలోని అన్న కేంటీన్‌లో భోజనం చేసి ఉండవల్లి గుహలను దర్శించారు. చివరగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సామాజిక న్యాయ శిల్పం ప్రాంగణాన్ని సందర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో జరిగే శాసన రూపకల్పన ప్రక్రియను చర్చలను ప్రత్యక్షంగా విద్యార్థులు అవగాహన చేసుకున్నారు. ఉండవల్లి చారిత్రిక కట్టడాలను శిల్పకళా వైభవాన్ని సందర్శించారు. ఈ క్షేత్ర పర్యటనలో రాజనీతి శాస్త్ర అధ్యాపకులు సీతామహాలక్ష్మి, సయ్యద్ యాస్రూన్ ఫరా, సరోజ, రామకృష్ణ, రాణి, కుసుమ కుమారి, సూర్య నారాయణ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



పలు శాఖల ప్రగతిపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వ్యవసాయ, హార్టికల్చర్, మత్స్య శాఖ, మైక్రో ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి, డిఆర్‌డిఎ తదితర శాఖల ప్రగతి లక్ష్యాల పురోగతిపై గురువారం కలెక్టర్ పి.ప్రశాంతి తన ఛాంబర్‌లో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగంలో ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రాధాన్యత నివ్వాలన్నారు. వ్యవసాయ రంగంలో చేపట్టిన కార్యక్రమాల లక్ష్య సాధన సకాలంలో పూర్తి చేయాలన్నారు. భూసార పరీక్షలు, వరితో పాటు ఇతర అంతర పంటలను ప్రోత్సహించాలన్నారు. కౌలు రైతులను రుణాలు మంజూరు, రైతు ఆర్థిక స్థితిని మెరుగుపరచే విధంగా రుణాల లక్ష్యాల ప్రగతిని సాధించాలన్నారు. జిల్లాలో మామిడి, అరటి, కోకో పండ్ల తోటల ప్రగతిపై సమీక్షించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేపట్టిన అంతర్గత రహదారులు, అనుసంధాన రహదారుల నిర్మాణం, నిడదవోలు పట్టెంపాలెం రహదారి అభివృద్ధికి అంచనాలు రూపొందించాలన్నారు. రోడ్లు భవనాల శాఖ ద్వారా చేపట్టిన వివిధ పనుల పురోగతిపై సమీక్షిస్తూ జిల్లాలో రహదారుల అభివృద్ధికి రూ.10 కోట్లతో 120 పనులు మంజూరు కాగా 46 పనులకు టెండర్లు ప్రక్రియ పూర్తికాగా 19 గ్రౌండ్ లెవెల్లో ఉన్నాయని, 6 పనులు పూర్తయ్యాయని చెప్పారు. డ్రైన్స్, కల్వర్ట్స్‌కు సంబంధించిన రూ.15 కోట్లతో 74 పనులు మంజూరు కాగా టెండర్లు ప్రక్రియలో ఉన్నట్టు తెలిపారు. మత్స్య శాఖ, పశు సంవర్ధక శాఖ ద్వారా చేపట్టి చేస్తున్న పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన తొలి 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రగతి చేపట్టిన పనులను, రెండోవ 100 రోజుల లక్ష్యాలను సాధించడంలో సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి ఎ.దుర్గేష్, జిల్లా హార్టికల్చర్ అధికారి బి.సుజాత కుమారి, డిఆర్‌డిఎ పీడీ ఎన్‌వివిఎస్.మూర్తి, జిల్లా ఆర్ అండ్ బి అధికారి ఎస్‌బివి రెడ్డి, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మానవ అక్రమ రవాణా నిర్మూలనపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం రెండో రోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం మాణిక్యాలరావు మాట్లాడుతూ మనుషుల అక్రమ రవాణా నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వామ్యం అయినప్పుడే సమూలంగా నివారించవచ్చన్నారు. మానవ అక్రమ రవాణా ప్రపంచంలోనే అతిపెద్ద నేరం అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగం, ప్రేమ, పెళ్లి, సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారని, ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి స్కూల్ అసిస్టెంట్ టీచర్ తమ పాఠశాలలో విద్యార్థులకు, మహిళలకు, బాలికలకు అక్రమ రవాణాపై అవగాహన కల్పించాలని, ఏవైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇది మానవతా దృక్పథంతో చేయాలని, దీని వల్ల చాలా మంది అమ్మాయిలు రక్షింప బడతారన్నారు. సంస్థ కో ఆర్డినేటర్ శ్రావ్య శృతి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిర్మూలన కోసం ప్రజ్వల సంస్థ గత 28 ఏళ్ల నుంచి పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ అసిస్టెంట్ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్, సుప్రియ, చెన్నకేశవ్, స్కూల్ అసిస్టెంట్స్, టీచర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఆన్ లైన్ నేరగాళ్లు చేసే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు గురువారం వెలుగు కార్యాలయ భవనంలో పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సైబర్ నేరాలపై అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. వెబ్ హ్యాకింగ్ నిర్వహించే హ్యాకర్స్ పట్ల, పోర్నోగ్రఫీ, సైబర్ టాకింగ్, వైరస్ అటాక్స్, వంటి వాటిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ ఉద్యోగాలు, చీటింగ్, థర్డ్ పార్టీ కాల్స్, ఒఎల్ఎక్స్ నేరాలు, ఎపికె మోసాలు, టాస్క్ బేస్డ్ మోసాలు, ఫేక్ ఎస్ఎంఎస్ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, ఏ చిన్న అనుమానం కలిగినా సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి కాల్ చేసి, పోలీస్ సహాయం పొందాలన్నారు. కొద్దిమంది సైబర్ నేరగాళ్లు స్కూల్ అడ్మిషన్లు, ఉద్యోగాలు అంటూ కాల్ చేస్తారని, ఆన్‌లైన్ అరెస్టులంటూ భయపెడతారని, ఇన్‌కంటాక్స్, కస్టమ్స్, సిఐడి, అంటూ ఫోన్ చేస్తారని, అటువంటివి వచ్చినప్పుడు వెంటనే హెల్ప్ లైన్ నెంబర్, లేదా స్థానిక పోలీసులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ ఎం.రత్నకుమారి, ఎజిఎం ఎం.ధర్మేంద్ర, ఉండ్రాజవరం ఎపిఎం టి.బాలకోటయ్య, ఎస్‌బిఐ మేనేజర్ ఎన్.హర గోవింద్, ఎఎస్ఐ కె.రామకృష్ణ పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చాగల్లులో మరుగుదొడ్ల పరిశుభ్రతా వారోత్సవాలు

ప్రజాశక్తి-చాగల్లు

ప్రపంచ మరుగుదొడ్ల పరిశుభ్రత వారోత్సవంలో భాగంగా నందిగంపాడు పంచాయతీ వద్ద గురువారం క్లాప్ మిత్ర సభ్యుడు ఎ.జానకి రామయ్యను ఇఒపిఆర్‌డి ఎన్.శ్రావణ్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతకు కృషి అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి వి.శిరీష రాణి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. ఊనగట్ల, బ్రాహ్మణగూడెంలో ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్లో హ్యాండ్స్ వాష్ కార్యక్రమంలో ఎంపిడిఒ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాతా సీతారాముడు

చెరువులపై పూర్తి హక్కులు కల్పించాలి

ప్రజాశక్తి- గోకవరం

రజక చెరువులపై పూర్తి హక్కులు కల్పించాలని పలువురు డిమాండ్ చేశారు. గోకవరంలో రజక చైతన్య సంస్థ కార్యదర్శి భీమవరపు వెంకన్న అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రజక చైతన్య సంస్థ అధ్యక్షులు మాతా సీతారాముడు, ప్రధాన కార్యదర్శి గంటి వెంకటేశుమాట్లాడారు. రజక చెరువులపై మూడు సంవత్సరాలకు ఒకసారి 10 శాతం పన్ను పెంచే విధంగా జిఒ ఉన్నప్పటికీ, కొన్ని పంచాయతీలలో విపరీతంగా పన్ను పెంచుతున్నారని తెలిపారు. జిఒ ప్రకారం హక్కు కల్పించాలని, ప్రభుత్వం రజకులకు కేటాయించిన దానిలో ప్రతిదీ లబ్ధి పొందడానికి అర్హత ఉన్న ప్రతివారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ గౌరవాధ్యక్షులు కోనేటి నాగరాజు, మండల అధ్యక్షులు తాడి కృపారావు, టౌన్ అధ్యక్షులు భీమవరపు రాఘవ, టేకు వీరబాబు, తెల్ల ప్రకాష్, మారేటి బాబూరావు, అర్ధపాక రమణ, చింతాడ కృష్ణ, ర్యాలి రాంబాబు పాల్గొన్నారు.

ఉత్తమ ఫిషర్‌మెన్ సొసైటీగా తీపర్రు

ప్రజాశక్తి-పెరవలి

మండలంలోని తీపర్రు ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీ జిల్లా ఉత్తమ సొసైటీగా ఎంపికయ్యింది. వరల్డ్ ఫిషరీస్ డే సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి ద్వారా బెస్ట్ ప్రెసిడెంట్ మల్లాడి రాంబాబు, బెస్ట్ వైస్ ప్రెసిడెంట్ ర్యాలి శ్రీనివాస్‌కు అవార్డులు అందజేశారు. వీరికి కంటిపూడి సూర్యనారాయణ, సింహాద్రి సత్యనారాయణ, పత్తిపాటి ప్రసాద్ కుమార్, పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న రాంబాబు

23, 24న వాలీబాల్, త్రో బాల్ పోటీలు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఈ నెల 23, 24న 16వ ఈషా గ్రామోత్సవం సందర్భంగా వాలీబాల్, త్రో బాల్ పోటీలు నిర్వహించనున్నారు. వాలీబాల్ పురుషులకు మొదటి బహుమతి క్లస్టర్ లెవెల్‌లో రూ.9000, 2వ బహుమతి రూ.6000, మూడవ బహుమతి రూ.3000, నాలుగో బహుమతి రూ.2000, త్రో బాల్ మహిళలకు క్లస్టర్ లెవెల్ మ్యాచెస్‌లో మొదటి బహుమతి రూ.5000, రెండో బహుమతి రూ.3000, మూడో బహుమతి రూ.2000 నాలుగో బహుమతి రూ.1500 ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఫైనల్ మ్యాచెస్ కోయంబత్తూర్‌లోని ఈషా ఆశ్రమంలో నిర్వహిస్తారని తెలిపారు.

పాఠశాలల పనివేళలపై ఉత్తర్వులు

ప్రజాశక్తి-చాగల్లు

రానున్న విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వ పాఠశాలల సమయాలను మార్పు చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ ఈ నేపథ్యంలోనే బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలో నిర్వహించాల్సిన వివరాలపై జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు ఉత్తర్వులు జారీ చేసినట్లు బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల టి.విజయ్ కుమార్ తెలిపారు.

ఉత్తమ ఫిషర్‌మెన్ అధ్యక్షునిగా ధర్మరాజు

ప్రజాశక్తి - కోరుకొండ

మత్స్యకార ఉత్తమ సొసైటీగా కాపవరం ఫిషర్‌మెన్ సొసైటీ ఎంపికవడంతో పాటు, ఉత్తమ ఫిషర్‌మెన్ సొసైటీ అధ్యక్షునిగా కాపవరం గ్రామానికి చెందిన కొండేటి ధర్మరాజు ఎంపికయ్యారు రాజమహేంద్రవరంలో జరిగిన మత్స్యకార దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో కొండేటి ధర్మరాజు అవార్డు అందుకున్నారు. జిల్లా కలక్టర్ పి.ప్రశాంతి, మత్స్యశాఖ జాయింట్ డైరక్టర్ ద్వారా ఆయన అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ధర్మరాజును పలువురు అభినందించారు.

వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందజేత

ప్రజాశక్తి-తాళ్లపూడి

క్షయ వ్యాధి గ్రస్తులు పౌష్టికాహారం పుష్టిగా తీసుకోవడం వల్ల ఆ వ్యాధి నుండి పూర్తిగా బయటపడే ఆరోగ్య వంతులుగా ఉండవచ్చని మలకపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ అన్నపూర్ణ అన్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు గురువారం ఆసుపత్రిలో పౌష్టికాహారాన్ని డాక్టర్ అందజేశారు. ఈ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా ఆరు నెలల పాటు మందులు వాడుతూ దానికంటే బాధ్యతగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఎవరికైనా రెండు వారాల నుంచి దగ్గు, ఛాతీలో నొప్పి, జ్వరం రావడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం, కళ్ళల్లో రక్త జీరా పడడం వంటి లక్షణాలు ఉంటే పిహెచ్‌సిలో క్షయ వ్యాధి గుర్తింపు పరీక్షలు ఉచితంగా పొందవచ్చని అన్నారు. సుగర్ వ్యాధితో బాధపడుతున్న ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఎస్ కృపావరం, సీనియర్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి వైద్య సిబ్బంది ఉన్నారు.



పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్

నేరాలు ఘోరాలు

సారా బట్టీపై దాడి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మురారి గ్రామంలో గురువారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ కెవివిడి.అర్జునరావు తెలిపారు. అలాగే కాత్రావులపల్లిలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా నిలవచేసిన 6 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు ప్రసాదరావు, చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురికి గాయాలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని గురువారం వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు గాయపడ్డారు. తాళ్లరేవు గొల్లలపేట నుంచి చొల్లంగిపేటకు నిశ్చితార్థ వేడుకకు సంబంధించింది రెండు ఆటోల్లో పలువురు బయలు దేరారు. ఆటో జి.వేమవరం జామకాయల తూము సెంటర్‌కు చేరుకునే సరిగా కాకినాడవైపు నుంచి వస్తున్న బైకును ఢీకొన్ని బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏసూరి గనికమ్మ, శవల చెల్లయమ్మ, తట్టుగళ్ల లోవ, మందాల దుర్గమ్మ, బాలుడు సాయి గణేష్ గాయపడ్డాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న సునీల్‌కు స్వల్ప గాయమైంది. అలాగే మండలంలోని జార్జిపేట పోలేకూరు వై.జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అమలాపురం మండలం జనిపల్లికి చెందిన కుడిపూడి మధనేశ్వరరావు బైకుపై కాకినాడ వైపు వెళ్తున్నాడు. వై.జంక్షన్ వద్దకు వచ్చేసరికి బారికేడ్‌ను ఢీకొని కింద పడిపోయాడు. అదే సమయంలో అమలాపురం నుంచి వస్తున్న ఆర్‌టిసి బస్సు అతని రెండు కాళ్లపై నుంచి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయడ్డాడు. అతన్ని కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారుల దాడులు

ప్రజాశక్తి - గండేపల్లి

రంగంపేట మండలం సింగంపల్లి, అనపర్తి మండలం పులగుర్తలో నిర్వహిస్తున్న మద్యం బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 124 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు విక్రయదారులను అరెస్టు చేసినట్లు రంగంపేట ఎక్సైజ్ సిఐ తెలిపారు. ఈ దాడుల్లో మంగళగిరి ఎస్‌టిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేట సర్కిల్ పరిధిలో గురువారం నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఇద్దరికి రెండు రోజులపాటు జైలు శిక్ష ఖరారు అయిందని సిఐ వైఆర్‌కె.శ్రీనివాస్ తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మరో 11 మందికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన, తాగి వాహనాలు నడిపిన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

విద్యుత్ షాక్‌తో ఒక వ్యక్తి మరణించిన సంఘటన గురువారం మండలంలోని కె.సావరంలో చోటు చేసుకుంది. మాదాసు నాగేంద్ర (35), నెక్కంటి పవన్ పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ప్రైవేట్ ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తున్నారు. ఇంటి వద్ద పెయింటింగ్ పనులు ఉండడంతో నాగేంద్ర పనిచేస్తున్న హాస్పటల్ నుండి నిచ్చెన తీసుకొనివచ్చి, తిరిగి ఇచ్చేందుకు తీసుకు వెళుతున్న క్రమంలో నిచ్చెన విద్యుత్ వైర్లకు తాకి, షాక్ తో సంఘటనా స్థలంలోనే మతి చెందాడు. నాగేంద్రకు భార్య గాయత్రి, ఒక పాప ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కడియం, పెరవలి

శుక్రవారం ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు వార్షిక మరమ్మత్తుల నిమిత్తం విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దాట్ల శ్రీధర్ వర్మ తెలిపారు,. మండలంలోని వీరవరం, దామిరెడ్డిపల్లి, మురమండ, పొట్టిలంక గ్రామాలకు సంబందించి వ్యవసాయ బోర్లకు, వీరవరంలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.

పెరవలి మండలంలో విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల కారణంగా ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్టలవేమవరం, నల్లాకులవారిపాలెం, పెరవలి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు విద్యుత్ శాఖ ఇఇ నారాయణ అప్పారావు, ఎఇ డేవిడ్ నిశ్చల్ తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకూ, వ్యవసాయ విద్యుత్ ఉదయం 4 గంటల నుండి ఉదయం 8 గంటల వరకు మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 5 గంటల వరకూ నిలుపుదల చేస్తామని తెలిపారు.

నర్సరీని సందర్శించిన రమణ దీక్షితులు

ప్రజాశక్తి-కడియం

మండలంలోని కడియపులంక శ్రీ శివాంజనేయ నర్సరీని తిరుమల తిరుపతి దేవస్థాన మాజీ ప్రధాన అర్చకులు రమణ దీక్షితులు గురువారం సందర్శించారు. వారికి నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు, నర్సరీ అధినేత మల్లు పొలరాజు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా కొన్ని రకాలు ఆయుర్వేద మొక్కలు గూర్చి ఆయన అడిగి తెలుసుకున్నారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తే కేసులు

ప్రజాశక్తి-చాగల్లు

పేద ప్రజలకు ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం పక్క దారి పట్టించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిఎస్ డిటి సుజాత హెచ్చరించారు. రేషన్ బియ్యం అక్రమ కొనుగోలు అమ్మకాలు నిర్వహిస్తున్నారని ఫిర్యాదు మేరకు మండలంలోని కలవలపల్లిలోని రైస్ మిల్లులు, కోళ్ల ఫారాలు, అనుమానం ఉన్న కొందరు వ్యక్తులు ఇళ్లల్లో తనిఖీ చేసినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెలలోనూ ఈ విధంగా తనిఖీలు జరుగుతాయని చెప్పారు. అక్రమాలు పాల్పడునట్లయితే గుర్తిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు పీడీ యాక్ట్ కూడా పెడతామని హెచ్చరించారు.

ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌ల పరిశీలన

ప్రజాశక్తి-తాళ్లపూడి

వర్షం, ఉష్ణోగ్రత, గాలి తీవ్రతలను గుర్తించి లెక్కించే సాధనాన్ని అన్ని సమయాల్లోనూ పనిచేసే విధంగా తరచూ పరిశీలిస్తూ ఉండాలని సంబంధిత శాఖ ఇంజనీర్ పలివెల అర్జున్ అన్నారు. మండల పరిధిలో వివిధ ప్రాంతాల్లోని ఆటోమేటిక్ వెదర్ స్టేషన్‌లను గురువారం అర్జున్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గేజ్‌లో ఉన్న సెన్సార్లు, కేబుల్‌లను మార్చి నైట్ వర్క్ చేసేలా చూడాలని ఈ స్టేషన్‌ల వల్ల ప్రభుత్వం ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం తెలుసుకుంటుందని తెలిపారు. స్టేషన్ ఇన్‌ఛార్జిగా ఉన్న ఎఎస్ఒ జోడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలో మొత్తం మూడు ఆటోమేటిక్ కేంద్రాలు ఉన్నాయని అన్నివేళలా సక్రమంగా పనిచేస్తున్నాయని అన్నారు. వెదర్ స్టేషన్ పరిశీలన సమయంలో వీరి వెంట ఎలక్ట్రికల్ ఇంజనీర్ జి.శ్రీనివాసరావు, రైతు గన్నిన సత్తిబాబు ఉన్నారు.

ఆదర్శలో జాతీయ ఫార్మసీ వారోత్సవాలు

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని కొత్తపల్లి ఆదర్శ కళాశాలలో 63వ జాతీయ ఫార్మసీ వారోత్సవాలు గురువారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాథరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గోకవరం గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ నుండి గ్రామ పంచాయతీ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ త్రినాథరావు మాట్లాడుతూ ఫార్మసిస్ట్ ఆవశ్యకత తెలియడం కోసం ఈ ర్యాలీ నిర్వహించినట్టు తెలిపారు. ఈ ర్యాలీలో ఆదర్శ విద్యార్థులు సుమారు 300 మంది, అధ్యాపక బృందం పాల్గొన్నారు. కో ఆర్డినేటర్ శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సుజిని, అధ్యాపక బృందం కామేష్, ప్రేమ్, సంకీర్తన, భార్గవి, దీప్తి, డాక్టర్ గణేష్, డాక్టర్ ప్రవీణ్, వలస రెడ్డి దీపిక అలేఖ్య శిరీష విద్యార్థులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పెరవలి

గల్ఫ్ దేశం కువైట్ మాంగఫ్ సూపర్ మార్కెట్ క్వార్టర్స్‌లో జూన్‌లో జరిఇన అగ్ని ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు కువైట్ ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయం గురువారం అందజేశారు. ఖండవల్లి, అన్నవరప్పాడు గ్రామాలకు చెందిన మృతులు మొల్లేటి సత్యనారాయణ, మీసాల ఈశ్వరుడు కుటుంబాలకు కువైట్ ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఒక్కొక్కరికీ రూ.12.64 లక్షల చెక్కులను కలెక్టర్ ప్రశాంతి మృతుల కుటుంబ సభ్యులకు అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

ప్రజాశక్తి - కోరుకొండ

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అధికారం తీసుకురావడంతో పాటు, వైఎస్ కుమార్తె షర్మిలను ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యమని పార్టీ జిల్లా అధ్యక్షుడు టికె.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. కోరుకొండలో గురువారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. షర్మిల పిసిసి పగ్గాలు చేపట్టిన నాటి నుండి ప్రజా సమస్యలపై పోరాడుతున్నారని తెలిపారు. వైసిపిని ప్రజలు బంగాళాఖాతంలో కలిపేశారన్నారు. త్వరలో ప్రతీ గ్రామంలోనూ పార్టీని బలోపేతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వడయార్, మోర్త శారద తదితరులు పాల్గొన్నారు.

రౌడీయిజంపై ఉక్కుపాదం మోపాలి

ప్రజాశక్తి - కోరుకొండ

గత ఐదేళ్లలో రాజానగరం నియోజకవర్గం రియల్ ఎస్టేట్ మాఫియాకు, దౌర్జన్యాలకు, అరాచకాలకు అడ్డాగా మారిందని ఎంఎల్ఎ బత్తుల బలరామకృష్ణ తెలిపారు. అసెంబ్లీ సమావేశాలలో గురువారం ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో ప్రస్తుత డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ అప్పట్లో రాజానగరం నియోజకవర్గంలో పర్యటనకు వచ్చిన సమయంలో వైసిపికి చెందిన వారు దాడులకు దిగారన్నారు. గత ఎన్నికల్లో పవన్ పర్యటన సందర్భంగా దాడి చేసి, కారును ధ్వంసం చేశారని తెలిపారు. దోపిడీలు, దౌర్జన్యాలకు దిగిన వైసిపి నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. రాజనగరం నియోజకవర్గంలోని పాలచర్ల, నిడిగట్ల, వెలుగుబంధ, రాజానగరం ప్రాంతాల్లో వెంచర్లు వేసి ఒకే భూమిని ఇద్దరు ముగ్గురికి రిజిస్ట్రేషన్లు చేశారని, చెరువులను కబ్జా చేసి ఆ భూములను అమ్మేసుకున్నారని ఎంఎల్ఎ తెలిపారు. రియల్ మాఫియాతో మోసపోయిన బాధితులు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసారన్నారు. భాదితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే కోరారు.

సర్వే సమస్యల పరిష్కారానికి సదస్సు

ప్రజాశక్తి - కోరుకొండ

గత ప్రభుత్వంలో జరిగిన రీసర్వే వల్ల వచ్చిన సమస్యల పరిష్కారం కోసం రెవిన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహశీల్దారు సుస్వాగతం తెలిపారు. మండలంలోని గుమ్ములూరులో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ అంబటి రజని, ఇన్‌ఛార్జి సర్వేయర్ సుల్తాన్ ఖాన్, విఆర్ఒ నాగలక్ష్మి పాల్గొన్నారు.



కోరుపల్లిలో ఫీవర్ సర్వేను పరిశీలిస్తున్న అధికారి

కోరుపల్లిలో ఫీవర్ సర్వే పరిశీలన

ప్రజాశక్తి-పెరవలి

కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కోరుపల్లిలో గురువారం ఫీవర్ సర్వేను అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటేశ్వరరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ మురళీకృష్ణ పరిశీలించారు. గ్రామంలో జ్వరాలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా గ్రామ సచివాలయం సెక్రటరీకి సూచనలు ఇచ్చారు. ప్రతి ఒక్కరికీ దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి మెడికల్ సిబ్బంది అవగాహన కలిగించాలన్నారు. ఈ కార్యక్రమం లో సర్పంచ్, పిహెచ్‌సి సూపర్‌వైజర్స్ వైద్య సిబ్బంది ఆశాలు వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ మత్స్య దినోత్సవం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ సమీపంలో కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులతో కలిసి 35 లక్షల చేప పిల్లలను గోదావరి నదిలో వదిలారు. తొలుత కలెక్టర్ పి.ప్రశాంతి మత్స్యకారుల సంఘాల ప్రతినిధులు, మత్స్యకారులకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాల జీవన ప్రమాణాలను పెంపొందించే దిశగా సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకునే కార్యక్రమాలను చేపట్టాలన్నది ముఖ్య ఉద్దేశమన్నారు. మత్స్య సంపదను పెంచేందుకు ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మత్స్య సంపదను పెంపొందించే దిశగా పారిశ్రామిక అభివృద్ధి కోసం, ఆక్వా సంబంధిత పరిశ్రమలు, మత్స్య ఉత్పత్తుల ఎగుమతులు ఆధారిత వాటిపై దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. మత్స్యకారుల్లో వృత్తి నైపుణ్యం పెంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

మత్స్యకారులు వేటాడి తీసుకొచ్చిన మత్స్య సంపదను మెరుగైన ఫలితాలు సాధించే విధంగా అప్‌గ్రేడ్ చేస్తూ మార్కెట్ సౌకర్యాన్ని కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఆయా విద్యా సంవత్సరంలో కొంత మంది విద్యార్థులకు ఆక్వా ఉత్పత్తుల పట్ల మరిన్ని మెలకువలను నేర్పాల్సిన అవశ్యకత ఉందన్నారు. మత్స్యకారులకు అందుబాటులో ఉన్న మత్స్య శాఖా పరంగా చేపట్టిన కార్యక్రమాలు, మత్స్య అభివృద్ధిలో విద్యార్థులు, ఎడ్యుకేషన్ కమ్యూనిటీ, పరిశోధన కేంద్రాల సామర్థ్యతను పెంచుకుంటూ వెళుతున్నామన్నారు. గతంలో సహజ సిద్ధంగా మాత్రమే మత్స్యకారులు వేటాడే వారన్నారు. నేడు విడుదల చేసిన 35 లక్షల చేప పిల్లలు మరో ఆరు నెలల్లో మత్స్యకారులు వేటాడేందుకు అందుబాటులో ఉంటాయని కలెక్టర్ తెలిపారు. మత్స్య సీడ్స్ తయారు చేసేందుకు 4, 5 నెలలు ముందు నుండే మత్స్య శాఖ చేప పిల్లల ఉత్పత్తి ప్రక్రియను ప్రారంభిస్తుందన్నారు. మార్కెట్‌కు అనుగుణంగా మత్స్య సంపద స్టోరేజ్ ప్రక్రియను ప్రారంభించాలన్నారు. మత్స్యకారుల పిల్లలు సంప్రదాయ వృత్తి పారిశ్రామిక వైపు దృష్టిని సారిస్తూ ఎదగాలన్నారు.



చేప పిల్లలను విడుదల చేస్తున్న కలెక్టర్ ప్రశాంతి

విదేశాల్లో డ్రై ఫిష్‌కు చాలా డిమాండ్ ఉందని, అందుకు అనుగుణంగా మన మత్స్య ఉత్పత్తులను మార్కెట్ సామర్థ్యాన్ని పెంపొందించుకునే సోలార్ డ్రై దిశగా అవకాశాలను మెరుగుపరుచుకోవాలన్నారు. జిల్లా మత్స్యశాఖ అధికారి వి.కృష్ణారావు మాట్లాడుతూ సుస్థిరమైన మత్స్య సాగు, రోజురోజుకూ తగ్గుతున్న తరుణంలో సహజ వనరుల్లో మత్స్య సంపదను ఏ విధంగా కాపాడుకోవాలనే మెలకువలు నేర్చుకోవాలన్నారు. రోజురోజుకూ వాతావరణంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని నూతన సాంకేతిక మెలకువలు నేర్చుకోవడం ద్వారా మన జీవనోపాధికి అవసరమైన మత్స్య సంపదను కాపాడుకోవచ్చుని ఆయన చెప్పారు. ప్రతి ఏడాదీ నవంబర్ 21న మత్స్యకారుల దినోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పలువురు మత్స్యకారులను ఘనంగా సన్మానించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి వి.కృష్ణారావు, తహశీల్దారు పివి.కుమార్, ఎంపిడిఒ శ్రీనివాసరావు, డిఎఫ్‌సిఎస్ ఎం.సత్తిబాబు, ఆర్ట్స్ కళాశాల ఫ్యాకల్టీ కె.దుర్గారావు, రవితేజ, రఘువీర్ పాల్గొన్నారు.

క్రీడల్లో ఓవరాల్ ఛాంపియన్‌గా గురుకులం

ప్రజాశక్తి-గోపాలపురం

పశ్చిమగోదావరి జిల్లా భీమడోలు మండలం పోనసనపల్లి గురుకుల పాఠశాలలో జరిగిన జోనల్ స్థాయి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఛాంపియన్స్ పోటీలలో గోపాలపురం గురుకులం విద్యార్థులు విజయ పతాకం ఎగరవేశారని పాఠశాల ప్రిన్సిపాల్ టి.ఉమాదేవి తెలిపారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జరిగిన పోటీల్లో గురుకుల పాఠశాల విద్యార్థులు 40 మంది పాల్గొన్నారని, ఈ పోటీలలో సీనియర్స్ విభాగంలో కబడ్డీలో ఏడుగురు ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. వాలీబాల్‌లో ఆరుగురు విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. వ్యక్తిగత క్రీడాంశం సీనియర్స్ వంద మీటర్ల పరుగు పందెంలో కె.మంజు బంగారు పతకం, 200 మీటర్ల పరుగు పందెలో కె.కుసుమలత బంగారు పతకం, 800 మీటర్ల పరుగు పందెంలో జి.ప్రవళిక బంగారు పతకం, 1500 మీటర్ల పరుగు పందెంలో జి.ప్రవళిక వెండి పతకం సాధించారని తెలిపారు. పాఠశాలలో వ్యాయామ టీచర్ తానేటి శిరీష, పిటి డి.గౌతమిని పిన్సిపల్ ఉమాదేవి అభినందించారు. డిసిఒ జి.వెంకట్రావు మాట్లాడుతూ జోనల్ స్థాయిలో జరిగిన పోటీలలో ఛాంపియన్‌షిప్ సాధించడం పట్ల విద్యార్థులను అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

రైతులకు వరి విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-కడియం

మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధి చేసిన నూతన వరి రకం ఎంటియు 1426 'చిరు సంచులు'ను రైతుల కమతాల్లో ప్రయోగం నిమిత్తం పంపిణీ చేస్తున్నట్టు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, డాక్టర్ మానుకొండ శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని మురమండలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సార్వా వరి పంట కోతలు దాదాపు 50 శాతం పూర్తయ్యి, దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో రబీ నారు మడులు వేస్తున్నారన్నారు. శాస్త్రవేత్తల వ్యవసాయ అధికారుల సూచనలు మేరకు మెలకువలు పాటించి, వచ్చే దాళ్వాలో అధిక దిగుబడి సాధించాలన్నారు. అభ్యుదయ రైతులకు నూతన వరి రకం ఎంటియు 1,426 చిరుసంచులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌సి ఎడిఎస్ ఎస్.జయరామలక్ష్మి, ఎఒ ద్వారకాదేవి, హెచ్ఒ సుధీర్‌కుమార్, అభ్యదయ రైతులు మరిడి వీరభద్రరావు, పాతూరి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.



చిరు సంచులు పంపిణీ చేస్తున్న అధికారులు

వ్యవసాయ శాఖ ప్రచురణల ఆవిష్కరణ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

వ్యవసాయ శాఖ రూపొందించిన ప్రత్యేక ప్రచురణలను గురువారం కలెక్టర్ పి.ప్రశాంతి ఆవిష్కరించారు. ప్రకతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించే దిశగా, రైతులు సొంతంగా చదువుకుని అవగాహన పొందడానికి వీలు కల్పించే పుస్తకాలు వీటిలో ఉన్నాయి. ఇందులో భాగంగా వ్యసాయ రంగానికి సంబంధించి సంక్షిప్త మార్గదర్శిని, రైతుల విజయ గాధలు, పురుగు, తెగుళ్ల యాజమాన్య దీపిక, పెరటి తోటల పెంపకం, ఫార్మర్ ఫీల్డ్ స్కూల్, వివిధ జాతుల పచ్చిరొట్ట పైర్లు, తొమ్మిది సార్వత్రిక సూత్రాలు, ఆరోగ్యం, పోషణ, ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల పాత్ర, సప్త సూత్రాల పోస్టర్లు, తొమ్మిది సార్వత్రిక సూత్రాలపై పుస్తకాలు, పాంప్లెట్స్, పోస్టర్లు, ఫోల్డర్లు ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు, ప్రకృతి వ్యవసాయ శాఖ డిపిఎం బి.తాతారావు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

ఆకుకూరలు, కూరగాయలు శ్రేష్టం

గోపాలపురం : పురుగుమందు అవశేషాలు లేని ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు తినడం ఆరోగ్యానికి ఎంతో శ్రేష్టమని సిడిపిఒ కె.నాగలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని భీమోలులో పంచాయతీ పరిధిలోని తొక్కిరెడ్డిగూడెం సహా నాలుగుచ అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రామంలో ఆకుకూరలు, కూరగాయల పంట సాగు అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో చేపట్టారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ కె.నాగలక్ష్మి మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో పురుగుమందు అవశేషాలు లేకుండా ఎరువులతో పండించిన పంటలు పిల్లలకు, బాలింతలకు, గర్భిణీ స్త్రీలకు అందించేందుకు ఆకుకూరలు పంట సాగు చేపట్టినట్లు తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం

గ్రంథాలయ ఉత్సవాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు గురువారం పలుచోట్ల బహుమతులు అందజేశారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

గోపాలపురం విద్యార్థి దశ నుండే గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విజేతలకు రూ.6 వేలతో మద్దిపాటి గంగరాజు ఏర్పాటు చేసిన బహుమతులను కొర్లపాటి రాము, జ్యేష్ట శ్రీనివాస్ రావు, ఎస్క్మి సతీష్ కుమార్ అందించారు.

తాళ్లపూడి తాళ్లపూడి శాఖ గ్రంథాలయంలో ముగింపు సభలో సహాయ గణాంక అధికారి జోడాల వెంకటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. మానవతా సేవా సంస్థ అధ్యక్షులు సురేష్, కోశాధికారి హనుమంతరావు, కార్యదర్శి రాజశేఖర్, పూర్వపు అధ్యక్షులు టిఎన్‌బి.గుప్త, జిల్లా సభ్యులు ఎస్.సుబ్బారావు, సభ్యులు దుర్గాప్రసాద్ వెంకట సత్యనారాయణ, అనిల్ కుమార్ పాల్గొన్నారు. 50 మంది విజేతలకు చదువరుల సంఘం ఉపాధ్యక్షులు గుండుబోగుల ఆదినారాయణ బహుమతి ప్రదానం చేశారు. గ్రంథ పాలకుడు నరేష్ పాల్గొన్నారు.



బిక్కవోలులో పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

బిక్కవోలు కొవ్వూరు సత్తిరెడ్డి ఉన్నత పాఠశాలలో హెచ్ఎం మల్లిపూడి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కొంకుదురు శాఖ గ్రంథాలయ అధికారి ఎన్.బాల మాట్లాడారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, యోగ్యతా పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకృష్ణసాయి, ఈశ్వర రెడ్డి, లక్ష్మణ రెడ్డి, సుధాకర రెడ్డి, చౌదరి, శిరీష, రాజశేఖర్ పాల్గొన్నారు.

సివి రామన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రతి విద్యార్థీ సైన్స్‌పై ఆసక్తితో చదువు కొనసాగిస్తూ దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా గుర్తింపు పొందాలని రాగోలపల్లి ఎంపిపి పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు అన్నారు. భౌతిక శాస్త్రవేత్త సివి రామన్ వర్ధంతి సందర్భంగా పాఠశాల ఆవరణలో గురువారం రామన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గారావు మాట్లాడుతూ రామన్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

టెక్నికల్ అసిస్టెంట్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

జాతీయ ఉపాధి హామీ పథకం, మండల సాంకేతిక సహాయకునిగా గొల్లపల్లి కాంతారావు ఉండ్రాజవరం బదిలీపై వచ్చి గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. కాంతారావు ఇప్పటివరకు రాజమండ్రి రూరల్‌లో విధులు నిర్వహించారు. కాంతారావు గత సంవత్సరం ఉండ్రాజవరంలోనే విధులు నిర్వర్తించి, బదిలీపై రాజమండ్రి రూరల్‌కు వెళ్లారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసిన ఎం.శ్రీనివాసు సీతానగరం బదిలీపై వెళ్లారు.